andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.1 : కనిష్ఠం 22.3
నిర్మల్
జిల్లా వార్తలు
8
సోమవారం 26 ఫిబ్రవరి 2024



జిల్లాలో అకాల వర్షం

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 25 : జిల్లాలో ఆదివారం రాత్రి అకాల వర్షం కురిసింది. సాయంత్రం నుంచి జిల్లాలోని పలు మండలాల్లో ఆకాశం మేఘావృతమై ఉంది. దీంతో రాత్రి 8 గంటల ప్రాంతం నుంచి జిల్లావ్యాప్తంగా పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ వర్షంతో పంటలకు పెద్దగా నష్టమేమీ లేదని పలువురు రైతులు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా పలుచోట్ల అకాల వర్షం కురవడంతో నిన్న మొన్నటి వరకు తీవ్ర చలిగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా సాధారణంగా మారిపోయింది. అకాశం మేఘావృతం కావడంతో చలితీవ్రత తగ్గిందని పలువురు చెబుతున్నారు.

కోతుల బీభత్సం

- ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు జంకుతున్న జనం
- వీధులన్నీ కోతుల గుంపులతో హైజాక్
- చేతిలో కర్ర రక్షణ లేకుండా వీధుల్లో నడవలేని పరిస్థితి
- బెదిరిస్తే భయంకరంగా ఎదురు దాడిచేస్తున్న వానరాలు
- ఇప్పటికే జిల్లాలో చాలా మందికి గాయాలు, ఆసుపత్రుల్లో చికిత్సలు
- మంకీ రెస్క్యూ సెంటర్‌ను పట్టించుకోని స్థానిక పాలకవర్గాలు





కోతుల బెడద నుంచి పంటలను కాపాడుకునేందుకు ఏర్పడిన బృందాలు



ఇటీవల కోతుల దాడిలో మరణించిన యువ రైతు సునీల్ (ఫైల్)



నిర్మల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకేంద్రంతో పాటు భైంసా, ఖానాపూర్ పట్టణాల్లోనే కాకుండా చాలా గ్రామాల్లో కోతులతో జనం తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. ముఖ్యంగా గత ఐదారు నెలల నుంచి కోతుల గుంపుల సంఖ్య విపరీతంగా పెరిగిపోవడం జనాన్ని ఆందోళనకు గురి చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోనే కాకుండా పట్టణ ప్రాంతాల్లోని గల్లీలలో కోతుల బీభత్సంతో జనం తల్లడిల్లి పోతున్నారు. వీధులన్నింటినీ కోతులు హైజాక్ చేసి గంటల తరబడి హంగామా సృష్టిస్తున్నాయి. గల్లీలలో కోతుల గుంపులన్నీ భారీ సంఖ్యలో గలాటా చేస్తున్న కారణంగా జనం ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేక అవస్థల పాలవుతున్నారు. చేతిలో కర్ర లేకుండా ఒక గల్లీ నుంచి ఇంకో గల్లీకి దాటి వెళ్లడం పద్మవ్యూహాన్ని తలపిస్తోంది. ఒకవేళ ఎవరైనా ఒక కోతిని బెదిరిస్తే పదుల సంఖ్యలో కోతుల గుంపులు వచ్చి ఎదురుదాడి చేస్తున్నాయి. ఇప్పటికే చాలా మంది కోతుల దాడిలో గాయపడ్డ వారు ఇక్కడి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతిరోజు ఐదారుగురు కన్నా ఎక్కువ మంది కోతుల దాడిలో గాయపడిన వారు చికిత్సల కోసం వస్తున్నట్లు వైద్యాధికారులు వెల్లడిస్తున్నారు. అయితే కోతులు ఇళ్లల్లోకి కూడా చొరబడుతూ బీభత్సం సృష్టిస్తున్నాయి. కోతులు కొట్లాడుకుంటూ గుంపులు గుంపులుగా దాడులు చేసుకుంటున్న కారణంగా ప్రజలు ఆ దృశ్యాలను చూసి భయాందోళనకు గురవుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఇలా కోతులతో జనం సహవాసం చేస్తూ తీవ్రటెన్షన్‌కు లోనవుతున్నారు. ఇప్పటికే చాలా మంది మున్సిపల్ అధికారులకు ఫారెస్ట్ అధికారులకు కోతుల విషయంలో ఫిర్యాదు చేసినప్పటికీ ఎవరూ చర్యలు తీసుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లల్లోకి చొరబడుతున్న కోతులు అక్కడి పంట చేలను సైతం నాశనం చేస్తున్నాయని అంటున్నారు. గుంపులు గుంపులుగా పంటలపై దాడులు చేస్తుండడంతో రైతులు రాత్రింబవళ్లు వాటిని అడ్డుకునేందుకు కాపలా కాస్తున్నారు. పంటలను కోతుల నుంచి రక్షించుకోవడం రైతులకు సవాలుగా మారింది. అలాగే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రజలు సైతం ఈ కోతుల బాధ నుంచి ఎలా బయట పడతామోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కోతుల నుంచి జనాన్ని, రైతులను కాపాడేందు కోసం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

పట్టించుకోని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు

కోతుల నుంచి రక్షించే విషయంలో సంబంధిత మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్న ఆరోపణలున్నాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోని కోతులను మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు పట్టుకొని నిర్మల్‌లోని కోతుల పునరావాస కేంద్రానికి తరలించాల్సి ఉంది. అయితే కోతులు పట్టే వ్యవహారం ఖరీదుగా మారిపోవడమే కాకుండా కోతులు పట్టేవారు కూడా అందుబాటులో లేకపోతుండడం సమస్యను మరింత జటిలం చేస్తుందంటున్నారు. మున్సిపాలిటీలు గ్రామ పంచాయతీలలో కోతులను పట్టుకునేందుకు ఎలాంటి బడ్జెట్ లేకపోవడం ఓ సమస్యగా మారిందంటున్నారు. అయితే కొన్ని గ్రామ పంచాయతీలు మాత్రం సాధారణ నిధుల నుంచి కోతులను పట్టుకొని నిర్మల్ పునరావాసానికి తరలిస్తున్నాయి. కొద్దిరోజుల క్రితం ఇక్కడి చించోలి వద్ద గల కోతుల పునరావాస కేంద్రానికి సిద్దిపేట, నర్సాపూర్ మున్సిపాలిటీల నుంచి దాదాపు 500ల కోతులను కుటుంబ నియంత్రణ ఆపరేషన్ కోసం తీసుకువచ్చినట్లు ఇక్కడి వైద్యాధికారి తెలిపారు. అయితే జిల్లా నుంచి మాత్రం ఆశించిన రీతిలో పునరావాస కేంద్రానికి కోతులను స్టెరిలైజేషన్ కోసం తీసుకురాకపోతుండడం విమర్శలకు తావిస్తోంది.

మూడున్నర ఏళ్ల నుంచి కేవలం 1456 స్టెరిలైజేషన్లు మాత్రమే

జిల్లాకేంద్ర సమీపంలోని చించోలి(బి) గండి రామన్న హరితవనంలో 2020లో ఏర్పాటు చేసిన మంకీ రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్ (కోతుల పునరావాస కేంద్రం)లో ఇప్పటి వరకు కేవలం 1456 కోతులకు మాత్రమే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు (స్టెరిలైజేషన్) చేశారు. ఇక్కడ 2020 డిసెంబరులో కోతుల పునరావాస కేంద్రాన్ని దాదాపు కోటి రూపాయల వ్యయంతో ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలలో గల కోతులను పట్టుకొని ఇక్కడి కేంద్రానికి తీసుకురావాల్సి ఉంది. ఇక్కడ స్టెరిలైజేషన్లు కాగానే వాటిని తిరిగి అదే ప్రాంతానికి పంపుతారు. ప్రతిరోజు 20కి పైగా కోతులకు స్టెరిలైజేషన్ చేసే సౌకర్యం ఇక్కడ ఉన్నట్లు పశువైద్యాధికారి తెలిపారు. ఇక్కడి కేంద్రంలో 150కి పైగా కోతులకు స్టెరిలైజేషన్ చేసి వారం రోజులపాటు ఇక్కడే పునరావాసం కల్పించే సౌకర్యం కూడా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇక్కడ ఉన్న సౌకర్యాలకు అనుగుణంగా ఇప్పటివరకు దాదాపు 5 నుండి 10 వేల కోతులకు స్టెరిలైజేషన్ చేసే అవకాశం ఉన్నప్పటికీ కేవలం 1456 కోతులకు మాత్రమే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరగడం గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల నిర్లక్ష్యానికి అద్దం పడుతుందంటున్నారు. జనాలు కోతుల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ఈ పాలకవర్గాలు పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అందరూ చొరవ తీసుకోవాలి

రోజురోజుకు అంతటా కోతుల సంఖ్య విపరీతంగా పెరుగుతుంది. కోతుల సంఖ్య తగ్గించాలంటే స్టెరిలైజేషన్ ఒక్కటే మార్గం. కోతుల నియంత్రణకు స్టెరిలైజేషన్ కోసం గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు మరింత చొరవ తీసుకోవాలి. ప్రస్తుతం విపరీతంగా పెరుగుతున్న కోతుల సంఖ్య ఓ సమస్యగా మారింది. సాధారణ ప్రజానీకం, రైతులు కూడా ఇబ్బందులకు గురవుతున్నారు. నిబంధనల ప్రకారం కోతుల సంఖ్యను నియంత్రించాలంటే ఒక స్టెరిలైజేషన్‌తోనే సాధ్యం. ఇప్పటికే వివిధ జిల్లాల నుండి కూడా నిర్మల్ కేంద్రానికి కోతులను తీసుకువచ్చి స్టెరిలైజేషన్ చేయిస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు కూడా మరింత చొరవ తీసుకుంటే కోతుల సమస్య కొంతవరకైనా తగ్గుతుంది.

- డాక్టర్ శ్రీకర్ రాజు, వైద్యాధికారి,
మంకీ రెస్క్యూ రిహాబిలిటేషన్ సెంటర్, నిర్మల్



బోనులో కోతిని ఉంచిన దృశ్యం (ఫైల్)



కోతులకు ఆపరేషన్ చేస్తున్న వైద్యుడు (ఫైల్)

అమ్మవారిని దర్శించుకున్న మాధవానంద పీఠాధిపతి



అమ్మవారి ఆలయంలో పీఠాధిపతి మాధవనంద సరస్వతి

బాసర, ఫిబ్రవరి, 25 : బాసర సరస్వతి అమ్మవారి ఆలయాన్ని ఆదివారం మాధవానంద పీఠాధిపతి మాధవనంద సరస్వతి సందర్శించారు. ఆలయానికి చేరుకున్న పీఠాధిపతికి ఆలయ పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకొని ప్రధాన ఆలయంలో పీఠాధిపతి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు



విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి సిద్ధమైన ఆలయం

కుంటాల, ఫిబ్రవరి, 25 : మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామంలో సోమవారం నుండి శివపంచాయతన మహాదేవస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఘనంగా జరగనున్నాయి. గ్రామాభివృద్ధి, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో చేపట్టనున్న ఇట్టి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం విగ్రహాల ఊరేగింపు, అనంతరం మహా గణపతిపూజ, స్వస్తివచనము, పుణ్య హావచనము, పంచగవ్వ సంస్కారము, రక్షాబంధనము, ఆచార్యాది ఋత్విక్‌వరణం, అంకురార్పణ, యాగశాల ప్రవేశం, అఖండదీప స్థాపన చతుషష్టి యోగిని సహిత వాస్తు క్షేత్రపాలక నవగ్రహ, సర్వతోభద్ర మండప దేవ, కలశస్థాపన పూజ, అగ్నిప్రతిష్ఠ, లక్ష్మీ, గణపతి వచనము, స్థాపిత దేవతావచనము, హోమాలు, గ్రామస్థులచే నదీజలాల ఊరేగింపు, పంచామృత స్నపనము, జలాధివాసము, హారతి, మంత్రపుష్పము వేద పండితులు సంజయ్‌శర్మ ఆధ్వర్యంలో చేపట్టనున్నట్లు గ్రామస్థులు పేర్కొన్నారు.


ప్రజలకు మెరుగైన
విద్యుత్ సరఫరా చేస్తున్నాం : ఎస్ఈ జేఆర్ చౌహాన్

- సమస్యలుంటే జీపీలోని నంబర్లను సంప్రదించండి

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 25 : విద్యుత్ వినియోగదారులకు జిల్లాలో మెరుగైన, నాణ్యమైన సేవలు తమ శాఖ, సిబ్బంది అందిస్తున్నారని జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్ తెలిపారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఎటువంటి విద్యుత్ కోతలు లేవని స్పష్టం చేశారు. అనధికారికంగా విద్యుత్ లైన్లపై కొండీలు వేయవద్దన్నారు. లైన్ల క్రింద చెట్లను నాటవద్దని సూచించారు. అలాచేస్తే కొమ్మలు అడ్డుగా వచ్చి ట్రిప్ అయ్యే అవకాశం ఉందన్నారు. ఇటీవల కుబీర్ మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మంటలు చెలరేగితే విద్యుత్ సిబ్బంది అప్రమత్తమై సరఫరాను పునరుద్ధరించారన్నారు. క్రింద సిబ్బందికి స్పష్టమైన సూచనలు చేశామన్నారు. ఫ్యూస్ ఆఫ్ కాల్స్ 4 - 5 గంటల మధ్య జరుపాలని ఆదేశాలిచ్చామన్నారు. వేసవి దృష్ట్యా విద్యుత్‌లోడ్ పెరుగనున్నందున అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ట్రిప్ అయినప్పుడు సిబ్బంది వెంటనే సమస్యలు పరిష్కరిస్తున్నారని తెలిపారు. ప్రజలు గ్రామ పంచాయతీలో ట్రాన్స్‌ఫార్మర్‌పై ఉన్న నంబర్లకు సంప్రదిస్తే సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

అంగరంగ వైభవంగా ముజ్గి మల్లన్న జాతర

- మల్లన్నను దర్శించుకున్న వేలాది భక్తజనం
- ప్రత్యేక పూజలు నిర్వహించిన ఒగ్గోళ్లు



గర్భగుడిలో పూజలు అందుకుంటున్న మల్లన్న స్వామి



పటం ముగ్గు వేస్తున్న ఒగ్గోళ్లు

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 25 : నిర్మల్ మండలంలోని ముజ్గి గ్రామంలో మల్లన్న జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. మల్లన్నను దర్శించు కోవటానికి తెలంగాణ, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చి మల్లన్నను దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వందల సంవత్సరాల చరిత్ర ఉన్న ముజ్గి మల్లన్న దేవస్థానంలో జాతర ప్రతి సంవత్సరం కన్నులపండుగగా జరుపుకోవడం, ఒగ్గోళ్లచే మల్లన్నకు ప్రతి సంవత్సరం సాంప్రదాయంగా ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుంది. ఇది కాకుండా మల్లన్నకు బోనాలు, చల్ల అంబళ్ళు సమర్పించి భక్తులు ప్రత్యేకపూజలు జరుపుకున్నారు. తదనంతరం మల్లన్న దేవస్థానం చుట్టూ రథాన్ని ఊరేగించి, వచ్చిన వేలాది మంది భక్తులకు అన్నదానం చేశారు.



గుడి చుట్టూ రథం తిరుగుతున్న దృశ్యం

ఎడ్‌బిడ్ గ్రామంలో కొనసాగుతున్న ఉత్సవాలు

- మల్లన్నను దర్శించుకున్న నాయకులు
- నేడు కుస్తీ పోటీలు, రాత్రి అగ్నిగుండ ప్రవేశం



సత్యనారాయణ వ్రతాలు చేస్తున్న భక్తులు

ముథోల్, ఫిబ్రవరి 25 : మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలోని మల్లన్న దేవుని జాతర కొనసాగుతుంది. మూడవ రోజైన ఆదివారం ఆయా ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముథోల్ బీజేపీ నియోజకవర్గ సీనియర్ నాయకులు భోస్లే మోహన్‌రావు పటేల్ మల్లన్న దేవుడిని దర్శించుకున్నారు. నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సన్మానించి దేవుని ఫోటోను ప్రసాదం అందజేశారు. సోమవారం కుస్తీ పోటీలు జరుగనున్నాయి. ఈ కుస్తీ పోటీలకు తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్ర నుంచి మల్లయోధులు వచ్చి పాల్గొంటారు. రాత్రికి అగ్నిగుండ ప్రవేశం నిర్వహిస్తారు. అలాగే భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుభాష్ జాదవ్, నిమ్మ పోతన్న, యాదవ్ సంఘం ప్రధాన కార్యదర్శి గురుప్రసాద్ యాదవ్, సుదర్శన్, దత్త్రాత్రి, ఉదయ్, రాంచందర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఆన్‌లైన్‌లో ఇంటర్ పరీక్షల హాల్ టిక్కెట్లు



భైంసా, ఫిబ్రవరి 25 : ఈ నెల 28 నుంచి ప్రారంభమయ్యే వార్షిక పరీక్షలకు సంబంధించి విద్యార్థుల హాల్ టిక్కెట్లను ఇంటర్ బోర్డు విడుదల చేసింది. ఇటీవల ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్ల లాగిన్ ద్వారా డౌన్‌లోడ్‌కు అవకాశం ఇచ్చిన ఇంటర్ బోర్డు తాజాగా విద్యార్థులే తమ హాల్ టిక్కెట్లను నేరుగా అధికారిక వెబ్‌సైట్ నుంచి పొందేలా ఆన్‌లైన్ ద్వారా అందుబాటులోకి తీసుకవచ్చింది. ఇంటర్ వార్షిక పరీక్షలు ఈ నెల 28 నుంచి మార్చి 19 వరకు జరుగనున్న విషయం తెలిసిందే. జిల్లా వ్యాప్తంగా 13,345 విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయబోతున్నారు. ఇందులో ప్రథమ సంవత్సర రెగ్యులర్ విద్యార్థులు 5463, వొకేషనల్ విద్యార్థులు 1072, ద్వితీయ సంవత్సరం రెగ్యులర్ విద్యార్థులు 5,772, వొకేషనల్ విద్యార్థులు 1038 మంది ఉన్నారు.

- హాల్ టికెట్ డౌన్‌లోడ్ విధానం ఇలా

ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులైతే ఎస్ఎస్‌సీ హాల్ టిక్కెట్ నంబరు, పుట్టిన తేదిని ఎంటర్ చేయడం ద్వారా హాల్ టిక్కెట్ పొందవచ్చు. ఇక ద్వితీయ సంవత్సరం విద్యార్థులైతే రోల్ నంబర్, గత యేడాది హాల్ టిక్కెట్ నంబర్, పుట్టిన తేది వివరాలను ఎంటర్ చేసి హాల్ టిక్కెట్ పొందాల్సి ఉంటుంది.

సంక్షిప్త సమాచారం

రాష్ట్ర మహాసభల్లో పాల్గొన్న కవులు



పాల్గొన్న జిల్లా కవులు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 25 : తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర మహాసభలు హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించారు. జిల్లాకు చెందిన కవులు నేరెళ్ల హనుమంతు, డాక్టర్ చక్రధారి, తుమ్మల దేవరావు, బీవీఆర్ చారి, వెంకట్, సుమతి పాల్గొని వివిధ ప్రక్రియలపై సందేశమిచ్చి తమ కవితా గానాన్ని వినిపించారు.


దివ్యాంగుల నూతన కార్యవర్గం ఎన్నిక



దివ్యాంగుల సంఘంను ఎన్నుకుంటున్న దృశ్యం

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 25 : దివ్యాంగుల మండల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఏ. శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా ఓస రవీందర్, కార్యదర్శి, కోశాధికారిగా గడ్పంద గంగన్నలను ఎంపిక చేశారు. నూతన కార్యవర్గానికి సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ



పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

కుభీర్, ఫిబ్రవరి 25 : మండలంలోని అంతర్ని గ్రామంలో రూ. 2లక్షల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు ఆదివారం పంచాయతీ సెక్రటరీ విజయ్‌కుమార్ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు జాదవ్ మాధవ్‌రావు, దగ్డే దేవిదాస్, జ్ఞానేశ్వర్‌లున్నారు.

అధికారుల నిర్లక్ష్యం
ఆదమరిస్తే ప్రమాదం



కుభీర్, ఫిబ్రవరి 25 : మండలంలోని డొడర్న, తండాల్లోకి వెళ్లే రహదారి ప్రమాదంగా మారింది. కుభీర్ నుంచి డొడర్న వెళ్లే మార్గంలో డోడర్నకు కిలోమీటర్ దూరంలో రోడ్డు కోతకు గురయింది. గతేడాది భారీ వర్షాలతో కోతకు గురయిన కల్వర్టు ఇప్పటి వరకు అధికారులు మరమ్మత్తులు చేపట్టలేదు. అధికారులు మరమ్మత్తులు చేపట్టాలని కోరుతున్నారు.

భక్తి శ్రద్ధలతో పోచమ్మకు బోనాలు

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 25 : మండలంలోని వడ్యాల్ గ్రామంలో గల ప్రసిద్ధ రేణుక ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవ ఉత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లోని గౌడ కులస్తులు, గ్రామస్థులు కుటుంబ సభ్యులతో వెళ్లి పోచమ్మ దేవతకు భక్తశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. మూడు రోజులపాటు జరుగబోయే ఈ ఉత్సవాలకు అన్ని రకాల ఏర్పాట్లను గౌడసంఘ సభ్యులకు పూర్తి చేశారు. సోమవారం రోజు పుట్టదని అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు. మంగళవారం అమ్మవారికి కల్యాణ మహోత్సవం నిర్వహించి, మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.


బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

ఘనంగా పెద్దమ్మ తల్లి మహోత్సవం


అగ్ని గుండాలు దాటుతున్న భక్తులు


జాతరకు వచ్చిన భక్తులు

పెంబి, ఫిబ్రవరి 25 : మండలంలోని మందపల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లికల్యాణం, జాతర మహోత్సవం వేడుకలను ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ జాతర సందర్భంగా అగ్నిగుండాలు, పెద్దమ్మ తల్లికల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవానికి పెంబి, ఖానాపూర్, కడెం, మామడ, వివిధ జిల్లాల నుంచి భక్తులు అధికసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అన్నదానం నిర్వహించారు. పూజారులు అర్జన్న, విష్ణు, భోజన్న, ముదిరాజ్ యువ సైన్యం సభ్యులు, అలాగే ముదిరాజ్ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

ఎడ్‌బిడ్ మల్లన్న దేవుడిని దర్శించుకున్న ముథోల్ ఎమ్మెల్యే రాంరావు పటేల్

ముథోల్, ఫిబ్రవరి 25 : మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో గల మల్లన్నదేవుడి జాతర ప్రారంభమైన మూడవరోజు ఆదివారం రాత్రి ముథోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిలువెత్తు బంగారాన్ని (బెల్లం) సమర్పించి ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి దేవుడి ఫోటోను, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సాగౌడ్, నిమ్మ పోతన్న, గురుప్రసాద్ యాదవ్, విఠల్ యాదవ్, సుదర్శన్, రామచందర్‌రెడ్డి, దత్తాత్రి, సాయరెడ్డి, ఆలయ నిర్వాహకులు, గ్రామస్థులు ఉన్నారు.


మల్లన్న దేవుడిని దర్శించుకున్న ముథోల్ ఎమ్మెల్యే రాంరావు పటేల్

నేడు పెంబిలో భీమన్న జాతర

పెంబి, ఫిబ్రవరి 25 : మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం, నాయికపోడ్ సంఘం ఆధ్వర్యంలో భీమన్న ఉత్సవాలను సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ముదిరాజ్, నాయికపోడ్ సంఘం నాయకులు మాట్లాడుతూ.. భీమన్న పండుగను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని, భక్తులు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. అగ్నిగుండం, భీమన్నకు ప్రత్యేకపూజలు ఉంటాయని తెలిపారు.

బడుగు, బలహీనుల ఆశాజ్యోతి అన్నబాహుసాఠే

తానూర్, ఫిబ్రవరి 25 : బడుగుబలహీనుల ఆశాజ్యోతి అన్నబాహుసాఠే అని ముథోల్ నియోజకవర్గ ఎమ్మెల్యే రాంరావు పాటిల్ అన్నారు. మండలం లోని ఉమ్రి(కే) గ్రామంలో ఆదివారం అన్నబాహుసాఠే విగ్రహ ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని అన్న బాహుసాఠే మనుమడు సచిన్ బావుసాఠేతో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్న బాహుసాఠే సాహితీవేత్తగా చేసిన సేవలను కొనియాడారు. అన్నబాహుసాఠే రచనలు, ఆయన ఆలోచన విధానంతో దేశ విదేశాలలో కూడా ప్రజాదరణ పొందాయన్నారు. బడుగు, బలహీనుల అభివృద్ధికి ఆయన పాటుపడ్డారని తెలిపారు. ఆయన నేటి తరానికి మార్గదర్శ కుడని, ప్రతీఒక్కరు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం వీరిరువురిని అన్నబావుసాఠే కమిటీ ఆధ్వర్యంలో శాలువతో సత్కరించి ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా మాదిగ కమిటీ అధ్యక్షుడు ఉత్తమ్ బాలేరావు, బీజేపీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, రిటైర్డ్ ఆర్టీవో గజ్జన్న, అధ్యక్షుడు గంగాధర్, ఎమ్ఆర్‌పీఎస్ నాయకులు, ఆయా గ్రామాల ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కబ్జా కోరల్లో చెరువులు, కుంటలు

▸▸ పంట పొలాలకు సాగు నీరందక ఇబ్బందుల్లో రైతులు ▸▸ ప్రభుత్వ భూములను విక్రయిస్తున్నా పట్టించుకోని అధికారులు

సారంగాపూర్, ఫిబ్రవరి 25 : చెరువులు, కుంటల భూములను కొందరు వ్యక్తులు కబ్జాచేసి విక్రయించి లక్షలు దండుకుంటున్న వైనం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండల కేంద్రంలో గల ప్రభుత్వ భూములను గుర్తించి పంటపొలాలకు సాగునీరును అందించాలనే ఉద్దేశ్యంతో చెరువులను, కుంటలను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించి పంట పొలాలకు సాగునీరును అందించింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను ప్రవేశపెట్టే తరుణంలో పంట పొలాల వివరాలతో పాటు ప్రభుత్వ భూములను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలను జారీ చేయడంతో కొందరు రెవెన్యూ అధికారులు ముడుపుల మత్తులో పడి ప్రభుత్వ భూములను ఆన్‌లైన్‌లో వివరాలను పొందుపరిచే సమయంలో సదరు వ్యక్తులపై చెరువులు, కుంటల భూముల సర్వే నంబర్లను ఆన్‌లైన్‌లో పొందుపర్చడంతో చెరువులు, కుంటలకు సంబంధించిన భూముల సర్వేనంబర్లతో కొందరి వ్యక్తులపై ధరణి పట్టా పాస్‌బుక్‌లు రావడం వల్ల వాటిని విక్రయిస్తూ చెరువులు, కుంటలు నామరూపం లేకుండా పోతున్నాయని ఆయకట్టు రైతులు పేర్కొంటున్నారు. దీంతో చెరువులు, కుంటల భూములను విక్రయిస్తునప్పటికీ రెవెన్యూ నీటి పారుదలశాఖ అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ భూములకు రైతుబంధు

అక్రమంగా ధరణిలో పట్టా పాస్‌బుక్‌లను సదరు వ్యక్తులపై సంబంధిత అధికారులు పట్టాలను సృష్టించి అందించడంతో రైతుబంధు డబ్బులు కొందరి వ్యక్తుల బ్యాంకు ఖాతాలలో జమ కావడంతో ప్రజాధనం వృధా అవుతుందని మండల రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చెరువులు, కుంటల భూములకు సంబంధించిన పట్టాపాస్‌బుక్‌లను రద్దు చేసి చెరువులు, కుంటలకు సంబంధించిన భూములను కాపాడాల్సిందిగా ఎంతైనా ఉందంటున్నారు.

ప్రభుత్వ భూములను విక్రయిస్తున్నా చర్యలేవి

ప్రభుత్వ భూములను అక్రమంగా కబ్జాచేసి భూములను కొందరు వ్యక్తులు విక్రయిస్తున్నా సంబంధిత అధికారులు ముడుపుల మత్తులో పడి చేసి చూడనట్లు వ్యవహరిస్తూ చర్యలు తీసుకోకపోవడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా రెవెన్యూ నీటిపారుదలశాఖ అధికారులు ప్రభుత్వ భూములను కాపాడాలని మండల కేంద్రానికి చెందని రైతులు కోరుతున్నారు.



కబ్జా చేసి విక్రయించిన ప్రభుత్వ భూమి

పంట పొలాలకు సాగు నీరు లేక ఇబ్బందులు

చెరువులు, కుంటలు కబ్జాకు గురికావడంతో పాటు చెరువు భూములను విక్రయించడంతో ఆయకట్టు భూములకు సాగు నీరందక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు ప్రభుత్వ భూములను భూ కబ్జా చేసి విక్రయిస్తున్న అక్రమార్కులపై చర్యలు తీసుకొని చెరువులకు, కుంటలకు సరిహద్దులను ఏర్పాటు చేసి పంట పొలాలకు సాగు నీరందే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.

ప్రభుత్వ భూములను గుర్తించాలి : సారంగాపూర్ రైతులు

ఇటీవల నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం చెరువులు, కుంటల భూములను గుర్తించి సదరు వ్యక్తులపై పట్టాలను సృష్టించిన అధికారులపై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూముల పట్టాలను రద్దు చేసి సదరు వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని ప్రభుత్వ భూములను ఆయకట్టు భూములను కాపాడాలని మండల కేంద్రానికి చెందిన రైతులు కోరుతున్నారు.

బీడీ వర్కర్స్ యూనియన్ స్వర్ణోత్సవ

ముగింపు సభను జయప్రదం చేయండి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సునారికారి రాజేష్

ఖానాపూర్, ఫిబ్రవరి 25 : 27వ తేదీన భైంసా పట్టణంలో నిర్వహించనున్న తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ స్వర్ణోత్సవ ముగింపు సభను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సునారికారి రాజేష్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని విశ్రాంతి భవనం ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 1972లో ఏర్పాటైన బీడీ వర్కర్స్ యూనియన్ బీడీ ప్యాకర్ల నెలసరి వేతన ఉద్యోగస్తులు, కార్మికుల కోసం ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో లక్షల మంది బీడీ కార్మికుల అభిమానాన్ని తమ సంఘం చూరగొందన్నారు. బీడీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తమ సంఘం నిరంతరం పోరాటం కొనసాగిస్తుందన్నారు. దేశవ్యాప్తంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా 1.70 కోట్ల మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నట్లు బీడీ పరిశ్రమను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు. బీడీ కార్మికులకు ఎటువంటి ఆంక్షలు లేకుండా ప్రతి నెలకు పది వేల జీవనభృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీడీ పరిశ్రమపై వేసి 28 శాతం జీఎస్‌టీని వెంటనే ఎత్తివేయాలన్నారు. బీడీ కార్మికుల సమస్యలపై తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ స్వర్ణోత్సవం ముగింపు సభలో పలువురు వక్తలు మాట్లాడతారని పేర్కొన్నారు. ఈ సభను విజయవంతం చేసేందుకు జిల్లావ్యాప్తంగా బీడీ కార్మికులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజల బీడీ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం లింగన్న, నాయకులు చిన్న రాజన్న, మాలవత్ జీవింద్, ప్రసాద్, తదితరులు ఉన్నారు.

మూగజీవాల దాహార్తి తీరుస్తున్న భగీరథ కవర్‌వాల్



కవర్‌వాల్ ద్వారా లీకేజీ అవుతున్న నీటితో దాహార్తి తీసుకుంటున్న మూగజీవాలు

కుభీర్, ఫిబ్రవరి 25 : రాష్ట్రంలోని మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఇంటింటికి తాగు నీరందించి వారి ఇబ్బంది తీర్చేందుకు ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టింది. ఈ పథకం ద్వారా ప్రజలకు నీరందించడంతో పాటు సరఫర చేసే పైప్‌లైన్ కవర్‌వాల్స్‌పై నుంచి కొందిపాటి నీరు రావడంతో ఈ లీకేజీతో మూగ జీవాలు, పక్షుల దాహార్తి తీరుతున్నది. గత రెండు మూడు రోజులుగా పగటివేళల్లో ఎండల వేడి పెరగడంతో పశుపక్షాదులు దాహార్తితో అల్లాడుతున్నాయి. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లే రోడ్డు మార్గంలోని కల్వర్టు సమీపంలో ఉన్న కవర్‌వాల్ మూగజీవాల దాహార్తి తీరుస్తుంది. ప్రతి రోజు మధ్యాహ్నం పశువులు ఇక్కడికి వచ్చి సేదతీరుతున్నాయి. దీంతో పశువుల కాపరులు సంతోషిస్తున్నారు.

లక్ష్మీపూర్ శ్రీరామ నూతన ఆలయంలో

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

- నేడు సీతారామలక్ష్మణ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం
- పెద్దఎత్తున తరలిరావాలని లక్ష్మీపూర్ గ్రామస్థుల విన్నపం

జైనథ్, ఫిబ్రవరి 25: జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో గ్రామస్థుల భాగస్వామ్యంతో నిర్మించిన శ్రీరామ ఆలయంలో రాముని బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేకపూజలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మించిన ఆలయం ముందర ఏర్పాటు చేసిన యాగశాలలో ప్రత్యేక హోమాలను పలు జంటలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు వేద మంత్రాలతో నవగ్రహాలకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. దీంతో పాటు వేదపారాయణము, తీర్థనయనం, మంత్రస్థాన ములు, ఉపవేదిక హోమములు, అమ్మవారి విగ్రహాలకు అభిషేకాలు, గ్రామోత్సవం అంగవైకల్య హోమం, శమ్యాది వాసం మొదలగు పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల చివరి రోజు అయిన సీతారామలక్ష్మణ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉంటుంది. ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్ జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు, మహిళలు, ప్రజలు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని లక్ష్మీపూర్ గ్రామస్థులు కోరుతున్నారు.



యాగశాలలో హోమం నిర్వహిస్తున్న జంటలు

అంతుచిక్కని తెగులు..అన్నదాతల గుబులు



మండల కేంద్రంలో తెగులు బారిన పడిన వరి పంట

నర్సాపూర్(జి), ఫిబ్రవరి 25 : మండల కేంద్రంలోని వరి పంట పొలాల్లో నాట్లు వేసి నెల సమయం గడుస్తున్నా అంతుచిక్కని తెగులు బారిన పడి పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయి. ఎన్నిసార్లు మందులు పిచికారి చేసినా ఫలితం లేదని రెతులు వాపోతున్నారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, వ్యవసాయ కళాశాలల ప్రొఫెసర్లు మండలానికి వచ్చి పరిశీలించి రైతులకు సలహాలు సూచనలు అందించాలని మండల వాసులు కోరుతున్నారు.

గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు

తలమడుగు, ఫిబ్రవరి 25: రానున్న వేసవి కాలంలో గిరిజన గ్రామాలు తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తుగా మండల పరిషత్ జిల్లా పరిషత్ నిధుల ద్వారా 15 ఫైనాన్స్ ద్వారా ప్రతి గ్రామంలో బోరు బావులను ఏర్పాటు చేసి సమస్య తలెత్తకుండా చర్యలు చేడపతున్నామని జడ్పీటీసీ గణేష్ రెడ్డి అన్నారు.

నేడు వెళ్లిపోతా

నాపై ఫిర్యాదు చేయండి

- ఎక్సైజ్ అధికారి

బోథ్, ఫిబ్రవరి 25 : ఎక్సైజ్‌శాఖలో పనిచేస్తున్న ఓ అధికారి నియోజకవర్గ పరిధిలోని ఈచ్పోడ సర్కిల్‌లో పని చేయడానికి ఇష్టం లేక వైన్ షాపుల వారితో పాటు తెల్లకల్లు వ్యాపారులపై తనదైన శైలిలో వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వైన్‌షాపులతో పాటు తెల్లకల్లు దుకాణాల తనిఖీ కోసం వెళ్లిన సమయంలో ఆ అధికారి నేను చాలా స్ట్రిక్ట్ మీ వద్ద మంచినీళ్లు కూడా తాగను, నిబంధనలకు విరుద్ధంగా ఏ చిన్న తప్పు చేసిన సీజ్ చేస్తానంటూ బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలిసింది. నియోజకవర్గ పరిధిలోని నేరేడిగొండ మండల కేంద్రంలో ఓ వైన్‌షాప్‌ను తనిఖీ చేసిన సమయంలో ఆ అధికారికి మర్యాద పూర్వకంగా మంచినీళ్లు ఇస్తే నేనేం బిచ్చగాడినా మీ నీళ్లకు నేను లొంగి ఉంటానా అంటూ అక్కడి సిబ్బందిని బెదిరించినట్లు సమాచారం. అయితే నేరేడిగొండ వైన్ షాప్ పక్కన పర్మిట్‌రూమ్ లేకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తపరిచినట్లు తెలిసింది. బోథ్ నియోజకవర్గం పక్కనే మహారాష్ట్ర సరిహద్దు ఉండటంతో ప్రతీరోజు వేలాది రూపాయల మద్యం అక్రమ రవాణా అవుతున్నా పట్టించుకోని అధికారులు మద్యం షాపులపై ఝులూం ప్రదర్శించడం ఏమిటని కొంత మంది వైన్ షాపుల వారు కాబోతున్నారు. లక్షలాది రూపాయలు రెంటల్ కట్టి వ్యాపారాలు చేస్తే తమపై ఎక్సైజ్ అధికారులు కొందరు జులూం చేస్తున్నారని వాపోతున్నారు. ఆయన బదిలీ కోసం ఈ విధంగా వ్యవహరిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. మీ దగ్గర దమ్ముంటే బదిలీ చేయిం అంటూ చేరుకుంటున్నారని వైన్‌షాప్‌ల వారు పేర్కొంటున్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- మాజీ మంత్రి జోగు రామన్న



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 25: తెలంగాణలో అధికారంలో వచ్చిన కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారంలో లేని సమయంలో రైతుల గురించి మాట్లాడిన నాయకులు ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సోనియగాంధీ జన్మదినం కానుక రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని ప్రకటించి రెండు నెలలు దాటుతున్న ఇప్పటి వరకు దాని ఊసే లేదన్నారు. జిల్లాలో లక్ష 64వేల 124 మంది రైతులకు రైతుబంధు కింద రూ.286 కోట్లు అవసరమైతే ఇప్పటి వరకు 94వేల 741 మందికి రూ.97కోట్ల 16 మాత్రమే వేశారన్నారు. రైతులు పండించిన సోయా 70 నుంచి 80 శాతం విక్రయించిన తర్వాత మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని ఎద్దెవా చేశారు. శనగ, కంది పంటలు రైతుల చేతికి వచ్చిందని, ఇప్పటి నుంచే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు చేయాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో ఏర్పాటు చేయని పక్షంలో రైతుల పక్షాన ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విజ్జగిరి నారాయణ, మాజీ మార్కెట్ చైర్మన్ కుమ్రరాజు, కౌన్సిలర్ వేణుగంటి ప్రకాష్, నాయకులు ఆనంద్, నవతే శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

జైనథ్, ఫిబ్రవరి 25: ఆదిలాబాద్ జిల్లాతో పాటునియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో గల యువకులు విద్యార్థులుచదువుతో పాటు క్రీడల్లో రాణించాలని బీజేపీ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి లోకప్రవీణ్‌రెడ్డి అన్నారు. ఆదివారం బేల మండలంలోని పాలైతాండాలో నిర్వహించిన సేవలాల్ సార్మర క్రికెట్ పోటీలను అధికారులు నాయకులతో కలిసి ప్రారంభించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులు ఎంతో ప్రతిభ ఉన్న ప్రోత్సాహం లేక వెనుకబడి పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.క్రీడలు శారీరక మానసిక అభివృద్ధికి పనికివస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ బేల మండల నాయకులు రాథోడ్ శ్యాంరావు, బొవాన్ దశరథ్, రాథోడ్ దినేష్, బొహాన్‌రాహుల్‌తో పాటు బేల మండలంలోని ఆయా గ్రామాల క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నారు.

సేవాలాల్ జగదాంబదేవి

పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

నేరడిగొండ, ఫిబ్రవరి 25: సేవాలాల్ జగదాంబదేవి, రామారావ్ మహారాజ్‌లకు ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ప్రత్యేకపూజలు చేశారు. మండలంలోని తన స్వగ్రామంలో (రాజురా)లో ఉన్న శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ జగదాంబ దేవి రామారావు మహారాజ్‌లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎమ్మెల్యేకు సన్మానం

నేరడిగొండ, ఫిబ్రవరి 25: మండలంలోని మాదాపూర్ గ్రామ ప్రజలు బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌ను సన్మానించారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ మాట్లాడారు. గ్రామంలో సమస్యల పరిష్కారం కోసం తనవంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు పటేల్, దేవరి మహాజన్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీకోసం పాటు పడే ప్రతి ఒక్కరికి ప్రత్యేక గుర్తింపు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానంద్

ఇచ్చోడ, ఫిబ్రవరి 25: బీజేపీ పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి పార్టీలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానంద్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సోనార్‌గల్లీలో భారతీయ జనతా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు బాబారావ్, మాధవ్‌రావు ఆమ్లె, గుమ్మడి భీంరెడ్డి, జిల్లా కార్యదర్శి కొల్లూరి చంద్రశేఖర్, నాయకులు మచ్చ అజయ్, దుక్రె దాము, భరత్, తానాజి, జాదవ్‌రాము, దినేష్, అర్జున్ తేజ, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ, ఫిబ్రవరి 25: పార్టీ బలోపేతం ప్రతీఒక్కరు శాయశక్తులా కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ అన్నారు. ఆదివారం నేరడిగొండ మండల కేంద్రంలోని బీజేపీ మండల పార్టీ కార్యాలయంలో రివ్యూ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపోలింగ్ బూత్ కమిటీలను బలపర్చాల్సిన బాధ్యత మన అందరి పై ఉందన్నారు. ఎవరైనా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా సహించేది లేదన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎంపీను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పోలింగ్ బూత్ అధ్యక్షులు వివిధ మోర్చల అధ్యక్షుడు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులకు అండగా ఉంటా

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 25: సింగరేణి కార్మికులకు అండగా ఉంటానని పెద్దపల్లి పార్లమెంట్ నాయకుడు, టీపీసీసీ కార్యదర్శి పెర్క శ్యామ్ పేర్కొన్నారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన ఐఎన్‌టీయూసీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పెద్దపల్లి ఎంపీ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ కార్యకర్తలు, సింగరేణి కార్మికులు ప్రధానపాత్ర పోషించి, కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు శ్రీనివాస్, తిరుపతి రాజు, శ్రీనివాస్, తిరుపతి, సాయి, తదితరులు పాల్గొన్నారు.

తపాల శాఖకు సొంతభవనాలు కరువు

- అద్దె భవనాల్లోనే నిర్వహణ
- అరకొర వసతులు.. తప్పని ఇబ్బందులు

వాంకిడి, ఫిబ్రవరి 25: సుదూరప్రాంతాల నుంచి వచ్చే సమాచారాన్ని గ్రామీణప్రాంతాలకు చేరవేసేందుకు ఏర్పాటు చేసిన తపాలశాఖ కార్యాలయాలు అరకొరవసతులతో కొట్టుమిట్టా డుతున్నాయి. కేంద్ర పరిధిలోని అనేకశాఖల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్న కేంద్రప్రభుత్వం తపాలశాఖ కార్యాలయాలకు మాత్రం కేటాయించడంలో నిర్లక్షంగా వ్యవహరిస్తోంది. జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, సిర్పూర్(టి) క్లస్టర్‌లలో మొత్తం 72బ్రాంచ్‌పోస్ట్ ఆఫీసులు పనిచేస్తున్నాయి. సిర్పూర్(టి) పరిధిలో 30, రెబ్బెన పరిధిలో 8, ఆసిఫాబాద్ మండలం చిర్రకుంట పరిధిలో 11, వాంకిడి పరిధిలో 8, కాగజ్‌నగర్ పరిధిలో 15 బ్రాంచ్ ఆఫీసులు పనిచేస్తున్నాయి. జిల్లాలో కేవలం రెబ్బెన, కాగజ్‌నగర్, సిర్పూర్(టి) సబ్‌పోస్ట్ ఆఫీసులకు మాత్రమే సొంత భవనాలు ఉండగా మిగిత మండలాల్లోని బ్రాంచ్‌పోస్ట్ ఆఫీసులు అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి.

ప్రతినెల 8నుంచి 10వేల రూపాయల అద్దెచెల్లిస్తున్న ప్రభుత్వం సొంతభవనాల నిర్మాణాలకు మాత్రం నిధులు విడుదల చేయకపోవడంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తం అవుతోంది. జిల్లాలోని ఆసిఫాబాద్, వాంకిడి, కెరమెరి, తదితర మండలాల్లోని తపాలకార్యాలయాల్లో అరకొర వసతుల కారణంగా పనిచేసే సిబ్బందితోపాటు వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒకపక్క అరకొర వసతులు, మరోపక్కసరిపడ సిబ్బందిలేని కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం తపాల కార్యాలయాల్లో ఆన్‌లైన్ సేవలు అమలు కావడంతోపాటు సేవింగ్ ఖాతాల వినియోగం పెరగడంతో పోస్ట్ మాస్టర్‌లకు పనిభారం పెరిగింది. దీంతో సకాలంలో పనులు పూర్తి కావడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి తపాలశాఖ కార్యాలయాలకు పక్కాభవనాలు నిర్మించి అన్ని వసతులు కల్పించాలని వినియోగదారులు కోరుతున్నారు.



వాంకిడిలో అద్దెభవనంలో కొనసాగుతున్న పోస్ట్ ఆఫీస్

సొంత భవనాలను నిర్మించాలి..
ఆరిఫ్ - వాంకిడి



తపాలశాఖ కార్యాలయాలకు సొంతభవనాలను నిర్మించాలి. తపాలశాఖ కార్యాలయాలు అద్దెభవనాల్లో నడుస్తుండడంతో వినియోగదారులకు సరైన వసతులులేక ఇబ్బంది పడుతు న్నారు. ఇతరశాఖల వసతుల కల్పనపై దృష్టి పెడుతున్న ప్రభుత్వాలు తపాలశాఖ కార్యాలయాలపై దృష్టిపెట్టడంలేదు. కొన్నేళ్ల నుంచి తపాలశాఖ కార్యాలయాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. తపాలశాఖ కార్యాలయాలకు పక్కాభవనాలు నిర్మించి వినియోగదారులకు సదుపాయాలు కల్పించాలి.

andhrajyothy.com
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 35.3, కనిష్ఠం 16.2

ఆంధ్రజ్యోతి

ఆదిలాబాద్ జిల్లా వార్తలు

5

సోమవారం 26 ఫిబ్రవరి 2024





- జిల్లాలో ప్రతీయేటా ఇంటర్ పరీక్షలకు దూరమవుతున్న ఆదివాసీ గిరిజన బాలలు
- ఈ యేడు పరీక్ష ఫీజు చెల్లించని వారు 1,690 మంది విద్యార్థులు
- అవగాహన లేకపోవడం, పేదరికం, ఆర్థిక ఇబ్బందులే అసలు కారణం
- దయనీయస్థితిలో ఇంటర్ విద్య.. పైచదువులకు దూరం
- అధికారులు చొరవ చూపితేనే అడవిబిడ్డల బంగారు భవిష్యత్తుకు బాట
- ఈనెల 28 నుంచి వార్షిక పరీక్షలు
- మొత్తం 13 ప్రభుత్వ, 6 మోడల్, 8 ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలు
- జిల్లావ్యాప్తంగా ఇంటర్ ప్రథమ, ద్వితీయ తరగతుల్లో మొత్తం 21,276 మంది విద్యార్థులు





జిల్లాకేంద్రంలో ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయం



ప్రతిభ ఉన్నా.. పరీక్షలకు దూరమే!

ఆదిలాబాద్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): చదువుకోవాలన్న ఆసక్తి, అపారమైన ప్రతిభ ఉన్నా.. జిల్లాలోని ఇంటర్ విద్యార్థులు వార్షిక పరీక్షలకు దూరమవుతున్నారు. నిరుపేద విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు ఆటంకంగా మారుతున్నాయి. వెంటాడుతున్న పేదరికంతో ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. ఎన్నో అష్టకష్టాలు పడి పాఠశాల విద్యను పూర్తి చేసినా.. ఇంటర్ విద్య అందని ద్రాక్షగా మారింది. అక్షర క్రమంలో ముందున్న జిల్లాలో ప్రతియేటా వందలాది మంది విద్యార్థులు ఇంటర్ చదువులకు దూరం కావడం ఆందోళనకు గురి చేస్తోంది. ప్రతియేటా పరీక్షలకు దూరమవుతున్న విద్యార్థుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం జిల్లాలో 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 6 మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలు, 8 ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఈ నెల 28 నుంచి మార్చి 19 వరకు వార్షిక పరీక్షలను నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ప్రథమ, ద్వితీయ తరగతుల్లో మొత్తం 21,276 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరం 9,577 మంది, ద్వితీయ సంవత్సరం 10,009 మంది విద్యార్థులు.. మొత్తం 19586 మంది విద్యార్థులు వార్షిక పరీక్షలకు హాజరవుతున్నారు. మిగితా 1690 మంది విద్యార్థులు వివిధ కారణాలు, ఆర్థిక ఇబ్బందులతో పరీక్ష ఫీజు చెల్లించలేక వార్షిక పరీక్షలకు దూర మవుతున్నారు. ఉదాహరణకు జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఫస్టియర్, సెకండీయర్ మొత్తం 758 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో వార్షిక పరీక్షలకు 691 మంది విద్యార్థులు మాత్రమే హాజరవుతున్నట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. అంటే ఒకే కళాశాలలో 67 మంది విద్యార్థులు పరీక్షలకు దూరమవుతున్న పరిస్థితి కనిపిస్తుంది. అసలే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంతంతమాత్రంగా చేరుతున్న విద్యార్థులు కనీసం పరీక్ష ఫీజు కూడా చెల్లించలేని పరిస్థితులు ఉన్నాయంటే జిల్లాలో ఇంటర్ విద్య ఎంత దయనీయంగా మారిందో తెలుస్తుంది. ఇంత జరుగుతున్నా.. సంబంధిత శాఖ అధికారులు మాత్రం పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నంచేయడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించి విద్యార్థులను ప్రోత్సహించి ఉంటే ఉన్నత చదువుల్లో జిల్లా ముందుండేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రోత్సాహం ఏదీ?!

ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లు పేద విద్యార్థులపై ప్రత్యేకదృష్టిని సారించి ప్రోత్సహిస్తే కొంతమేరకైనా విద్యార్థుల హాజరు సంఖ్య పెరిగి ఉండేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనికితోడు ప్రభుత్వ విద్యపై ఇంకా ప్రజల్లో చిన్నచూపే కనిపిస్తుంది. ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ కళాశాలలను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలను చేస్తున్న ప్రయోజనం కనిపించడం లేదు. మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల, ట్రైబల్ వెల్ఫేర్, రెసిడెన్షియల్ కళాశాలలో పరీక్ష ఫీజుల చెల్లింపులు, విద్యార్థుల హాజరు శాతం కొంత మెరుగ్గానే కనిపిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే పరిస్థితి మరీ దారుణంగా తయారవుతుంది. జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు కేవలం కళాశాలకు వచ్చి పోవడమే తప్ప విద్యార్థుల బాగోగులను పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. విద్యార్థుల్లో మరింత అవగాహన పెంచి భవిష్యత్తుపై భరోసాను కల్పించాల్సిన అవసరం అధికారులపై ఎంతైనా ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. వెనుకబడిన పేద విద్యార్థులను గుర్తించి ప్రభుత్వమే పరీక్ష ఫీజులతో పాటు ఇతర సౌకర్యాలు, వసతులను కల్పిస్తే బాగుండేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఉన్నత చదువులకు దూరం

జిల్లాలో ప్రతియేటా ఎందరో మంది విద్యార్థులు ఇంటర్మీడియట్‌తోనే చదువులను నిలిపి వేస్తున్నారు. పదవ తరగతి వరకు స్థానికంగానే చదువుకుంటున్న విద్యార్థులు ఇంటర్మీడియట్ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లలేక పోతున్నారు. ముఖ్యంగా ఆడపిల్లలను కళాశాలలకు పంపించేందుకు తల్లిదండ్రులు ముందుకు రావడం లేదు. అలాగే ఉన్నత చదువులపై తల్లిదండ్రుల్లో ఇంకా అపోహలు తొలగిపోవడం లేదు. ఇంటర్మీడియట్ చదువుతుండగానే ఆడ పిల్లలకు పెళ్లిలు చేస్తూ.. తల్లిదండ్రులు బాధ్యతల నుంచి తప్పుకుంటున్నారు. ఇలా ప్రతియేడు వందలాది మంది విద్యార్థులు పెళ్లిలతో మధ్యలోనే చదువులను నిలిపి వేస్తూ.. ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. అలాగే కుటుంబ భారం మీద పడడంతో వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేస్తూ చదువులను మధ్యలోనే ఆపేస్తున్నారు. మొదటి సంవత్సరం పరీక్ష ఫీజు రూ.510, ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫీజు రూ.710 చెల్లించలేని పరిస్థితుల్లో వందలాది మంది విద్యార్థులు ఉన్నారు. ఇలాంటి విద్యార్థుల పరిస్థితిని గుర్తించి ప్రభుత్వమే ఆదుకోవాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరికొందరైతే ఉపాధి కోసం గల్ఫ్ బాట పడుతుండగా.. మరి కొంతమది విద్యార్థులు బోరు మోటార్లపై పని చేస్తూ ఇంటికి దూరమవుతున్నారు. వివిధ రకాల పరిశ్రమలలో స్వయం ఉపాధి పొందుతూ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు.



ప్రభుత్వమే పరీక్ష ఫీజులను చెల్లించాలి

: రాహుల్, విద్యార్థి సంఘాల జేఏసీ కన్వీనర్, ఆదిలాబాద్

గ్రామీణ నిరుపేద విద్యార్థుల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వమే విద్యార్థుల పరీక్ష ఫీజులను చెల్లించాలి. ప్రైవేట్ కళాశాలల్లో చదువుకునే స్థోమత లేని విద్యార్థులు మాత్రమే ప్రభుత్వ కళాశాలల్లో చదువులు కొనసాగిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులను ఆదుకోవాలి. ఎక్కువగా చదువులకు దూరమవుతుంది కూడా ఈ వర్గానికి చెందిన విద్యార్థులే. ప్రభుత్వం దృష్టి సారించక పోవడంతోనే ఎందరో మంది పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు.



సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేయాలి

: రవీంద్రకుమార్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి

సంబంధిత కళాశాల ప్రిన్సిపాళ్లు విద్యార్థుల సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేయాలి. ఎందుకు విద్యార్థులు కళాశాలకు రావడం లేదో? గుర్తించాల్సిన బాధ్యత వారిపై ఉంటుంది. అలాగే విద్యార్థులు డ్రాపౌట్ కాకుండా చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా ఆర్థిక ఇబ్బందులు, తల్లిదండ్రుల్లో అవగాహన లేకపోవడమే ఇలాంటి పరిస్థితికి కారణమవుతుంది. కళాశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతే సంబంధిత అధికారులే బాధ్యత వహించాలి. మా దృష్టికి వచ్చిన విద్యార్థుల సమస్యలను పరిష్కరించి చదువులు కొనసాగించేలా చర్యలు తీసుకుంటున్నాం.



సంక్షిప్త సమాచారం



ఎల్‌బీనగర్‌లో నిర్మించిన నూతన ఆలయం

నేడు విగ్రహ ప్రతిష్ఠాపన

ఉట్నూర్, ఫిబ్రవరి 25: మండలకేంద్రంలోని ఎల్‌బీనగర్‌లో సోమవారం నూతనంగా నిర్మించిన ఆలయంలో అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహిస్తున్నారు. వేద పండితులు విశాల్‌శర్మ బృందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఈ సందర్భంగా రుద్రయాగం, పుష్పదాన్య దివాసం, శాయ్యదివాసం, నగర ప్రదక్షిణ, హారతి, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. విగ్రహం ప్రతిష్ఠాపన కార్యక్రమానికి జడ్పీ ఛైర్మన్ జనార్ధన్ రాథోడ్, ఎంపీ సోయం బాపురావు, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జుపటేల్, కోవ లక్ష్మి, జాదవ్ అనిల్, పాయల శంకర్, తదితరులు వస్తున్నట్లు వారు తెలిపారు.

● నేడు కప్పర్లలో..

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామంలో రూ.కోటీ 50 లక్షలతో నిర్మించిన రామాలయం సోమవారం ప్రతిష్ఠాపన కానుంది. గత ఆరు మాసాలుగా ఈ ఆలయ నిర్మాణాన్ని వాస్తు ప్రకారం నిర్మించారు. ఆలయంలో సీతారామ లక్ష్మణ విగ్రహాలతో పాటు ఆంజనేయ స్వామి గణపతి విగ్రహాలను కూడా ప్రతిష్ఠించనున్నారు. ఆదివారం 51 జంటలతో మహాయజ్ఞం నిర్వహించారు. సోమవారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. జాతరను కూడా ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి మహా అన్నదానం కూడా నిర్వహిస్తున్నట్లు మాజీ సర్పంచ్ సదానందం పేర్కొన్నారు. కాగా, భక్తులు పెద్దసంఖ్యలో హాజరవ్వాలని గ్రామస్థులు కోరారు.



ముస్తాబైన ఆలయం

కోలాం సేవా సంఘం ఎన్నిక

భీంపూర్, ఫిబ్రవరి 25: భీంపూర్ మండల ఆదిమ గిరిజన కోలాం సేవ సంఘాన్ని ఆదివారం అర్లి (టి) అనుబంధ గ్రామం శాంతినగర్‌లో కోర్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షుడుగా ఆత్రం బేరు, మండల అధ్యక్షుడుగా గుంజాల చెందిన ఆత్రం పైకు, ప్రధాన కార్యదర్శిగా త్రం జనార్ధన్, ఉపాధ్యక్షుడిగా కొడప రామారావులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కోలం సేన సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసి సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవి

● గోండి ధర్మగురు హీరాసుక్క జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాయల శంకర్ ● చిల్కూరి లక్ష్మినగర్‌లో సంత్ రవిదాస్ జయంతి



హీరాసుక్క ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్



సంత్‌రవిదాస్ చిత్రపటానికి పూలమాలలు వేస్తూ..

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 25: ఆధునిక యుగంలో ఆదివాసి సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుకుంటూ, భావితరాలకు అందించాలని, అవి ఎంతో గొప్పవని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఆదివారం హీరాసుక్క జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన గోండి ధర్మగురు హీరాసుక్క జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. బస్టాండ్ ఎదుట గల హీరాసుక్క ఆలయంలో పూజలు చేశారు. ఆదివాసీల సంస్కృతికి అనుగుణంగా పూజలు చేస్తూ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రాంజీగోండు, కుమ్రంభీం విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ దేశంలో ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని తెలిపారు. వాటిని భావితరాలకు అందించేలా కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా హీరాసుక్క జయంతిని అధికారికంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో హీరాసుక్క జయంతిని నిర్వహించేలా కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హీరాసుక్క జాగృతి నాయకులు సిడాం రాంకిషన్, మెస్రం కృష్ణ, గేడం జనార్ధన్, గేడం మనోహర్, ఆదివాసీ పర్థాన్ సేవా సంఘం అధ్యక్షుడు దుర్వ నగేష్, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

● మహాపురుషుడు.. సంత్ రవిదాస్

ఆదిలాబాద్ అర్బన్: మహాపురుషులు మన మధ్య లేకున్నా.. వారి ఆలోచన ద్వారా ఎల్లప్పుడు వారు మనతోనే ఉంటారని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. సంత్ రవిదాస్ జయంతి సందర్భంగా స్థానిక చిల్కూరి లక్ష్మినగర్‌లో నిర్వహించిన జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక బలహీన వర్గానికి చెందిన వ్యక్తి తన ఆలోచనల ద్వారా సమాజాన్ని ఉత్తేజపరుస్తూ తన మాటల ద్వారా సామాజిక చైతన్యాన్ని తీసుకొచ్చిన మహాపురుషుడు సంత్‌రవిదాస్ అని అన్నారు. టెక్నాలజి, సాంకేతికత ఉన్న ఈ రోజుల్లో ఒక విషయాన్ని తెలుసుకోవడం గాని ఒక విషయాన్ని నలుగురికి చేరవేయడం అతి సాధారణమైన అంశం.. కానీ ఆయన కాలంలో ప్రజల్ని చైతన్య వంతులను చేయడానికి ఆయన పడిన శ్రమ వృధా కాలేదన్నారు. అందరికీ విద్య, ఆధ్యాత్మిక ఆయన ద్వారా ఎంతో మందికి మార్గదర్శనాన్ని చేశాయన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల అనంతరం అర్హులందరికి ప్రధానమంత్రి అవాస్‌యోజన కింద ఇళ్లను ఇచ్చే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఇందులో గౌరవ అధ్యక్షుడు దాదారావు, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రఘునాథ్ ఇట్కరే, గాయక్వాడ్ సంజయ్, సంతోష్ వింకరే, రాజుకదం, సందీప్ జంజల్కర్, జిల్లా నాయకులు మహేందర్, జోగురవి, పొచ్చన్న, ముకుంద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

● రవిదాస్ నవలలు సమాజాన్ని కదిలించాయి

సంత్ రవిదాస్ 647పుణ్యతిథి కార్యక్రమాన్ని పురస్కరించుకుని పట్టణంలోని స్థానిక చిల్కూరి లక్ష్మినగర్‌లోని సంఘ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొన్నారు. అనంతరం సంత్ రవిదాస్ చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేశారు. అనంతరం మాజీమంత్రి జోగురామన్న మాట్లాడుతూ మానవహక్కులు సమానత్వంపై సంత్ రవిదాస్ నవలలు రచనలు యావత్ సమాజాన్ని కదిలించాయన్నారు. ఆధ్యాత్మికతతో పాటు సమాజ ఔన్నత్యానికి ఆయన చూపించిన స్ఫూర్తి మరువలేనిదని ఆయన కొనియాడారు.



జాతీయ స్థాయిలో గెలుపొందిన క్రీడకారులు

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

నేరడిగొండ, ఫిబ్రవరి 25: ఈనెల 21 నుంచి 25 వరకు బీహార్‌లోని పట్నాలో 41వ జూనియర్ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ ఛాంపియన్ షిప్ 23-24 బాలబాలికల పోటీల్లో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించి ఫైనల్‌లో కేరళ జట్టుపై ఒక్క రన్ను తేడాతో రాష్ట్ర జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. ఇందులో జిల్లా నుంచి బాలురలో అఖిల్, బాలికల నుంచి డి.శిరీష, ఎం.అలేఖ్య, బి.అనితలు కోచ్ స్నేహ ఆధ్వర్యంలో బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రెసిడెంట్ జాదవ్ అనిల్, ప్రధాన కార్యదర్శి గన్నంటి గంగా ధర్, జిల్లా ఎస్‌ఐఎస్ కోచ్ ఓ.అఖిల, అసోసియేషన్ సభ్యులు, జిల్లా పేట ప్రెసిడెంట్ సెక్రెటరీలు వారిని అభినందించారు.

● జిల్లాస్థాయి సైన్స్ క్విజ్ పోటీల్లో తాంసి విద్యార్థిని..

తాంసి: జిల్లాస్థాయిలో జరిగిన నేషనల్ సైన్స్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన సైన్స్ క్విజ్ పోటీలో తాంసి జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని బిందుజకు ద్వితీయ బహుమతి వచ్చింది. ఈ బహుమతిని ఆదివారం జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత అందజేశారు. కాగా బిందుజను ఉపాధ్యాయులు, తదితరులు అభినందించారు.

'రాజకీయాల్లో కక్ష సాధింపు ఉండవద్దు'

మావల, ఫిబ్రవరి 25: రాజకీయ నాయకుడికి కక్ష సాధింపు ధోరణి ఉండకూదని, ఎన్నికల్లో గెలిచిన తర్వాత అందరూ సమానమని, అభివృద్ధి చేయాలని డీసీసీబీ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని లాండ సాంగి గ్రామంలో మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ఈజీఎస్ పథకం కింద మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కాంగ్రెస్ నేత కంది శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పనులను ప్రారంభించారు. ఇందులో కిషన్, కొండూరి రవి, ముఖీమ్, సుదర్శన్, గజానంద్, విఠల్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేసిన ఎంపీ

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 25: పేదల సంక్షేమం కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ సోయం బాపురావు అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉజ్వల పథకం కిందమంజూరైన వంద మంది లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్లను ఎమ్మెల్యే పాయల శంకర్‌తో కలిసి పంపిణీ చేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ సోయం బాపురావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అనేక పథకాలను ప్రవేశ పెట్టిందని, వాటి గురించి తెలియక లబి పొందలేక పోతున్నారన్నారు. వికసిత్ భారత్ పేరిట దాదాపు 45 రోజుల పాటు ప్రచార వాహనాల ద్వారా అవగాహన కల్పించడం జరిగిందన్నారు. కేంద్ర పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయని కారణంగా ఎంతో మంది వాటిని వినియోగించుకోవడం లేదన్నారు. తన తల్లి పడ్డ కష్టాలు దేశంలో ఏ ఒక్క మహిళ పడవద్దనే ఉద్దేశంతో ప్రధాని మోదీ ఉజ్వల పథకం కింద ఉచితంగా గ్యాస్ సిలీలిండర్లను అందిస్తున్నారని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జోగురవి, వేదవ్యాస్, ధోనిజ్యోతి, చిల్కూరిజ్యోతిరెడ్డి, స్వప్న, రేఖ, నందబాయి, సతీష్, ముకుంద్, తదితరులు పాల్గొన్నారు.

● కళ్లకు గంతలతో అయోధ్యకు వెళ్లడం అభినందనీయం

ఆదిలాబాద్ అర్బన్: హిందువుల 500ఏళ్ల కల అయోధ్య రామమందిర నిర్మాణాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేరవేర్చారని, రామున్ని దర్శించుకోవడానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివెళ్తున్నారని ఎంపీ సోయం బాపురావు అన్నారు. సాహసోపేతంగా ఇద్దరు మెజీషియన్లు కళ్లకు గంతలు కట్టుకుని అయోధ్యకు వెళ్లడం అభినందనీయమని అన్నారు. ఈ నెల 23న ముచ్చింతల్ నుంచి మెజీషియన్ మురళీజోషి, రామకృష్ణలు అయోధ్యకు కళ్లకు గంతలు కట్టుకుని తమ బైక్ యాత్రను ప్రారంభించారు. కాగా, ఆదివారం వీరి యాత్ర ఆదిలాబాద్‌కు చేరుకోగా గోపాలకృష్ణ మఠంలో పీఠాధిపతి యోగానంద సరస్వతితో కలిసి ఎంపీ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సాహసోపేతంగా ఇద్దరు మెజీషియన్లు రామ మందిర దర్శనానికి అయోధ్యకు బైక్ యాత్ర చేపట్టడం వారి భక్తికి నిదర్శనమని అన్నారు. 500 ఏళ్ల కల నెరవేరిన వేల ఏదో వినూత్నంగా చేయాలనే ఆలోచనతో తన మిత్రుడు రామకృష్ణతో కలిసి ఈ బైక్‌యాత్రను చేపట్టామని మురళీజోషి తెలిపారు. సాధరణ ప్రజల కంటే వినూత్నంగా మెజీషియన్లు అయిన తాము ఇలా యాత్ర చేపట్టామని వారు వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. యాత్రలో భాగంగా రోజుకు రెండు వందల కిలో మీటర్ల వరకు ప్రయాణం సాగిస్తున్నామని తెలిపారు.

సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన ఎంపీ

సిరికొండ: సిరికొండ మండల కేంద్రంలో ఆదివారం ఎంపీ సోయం బాపురావు రూ.8లక్షల నరేగా నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వంతోనే మారుమూల గ్రామాల అభివృద్ధి సాధ్యమని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి మరోసారి నరేంద్రమోదీ ప్రభుత్వానికి మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలగంగాధర్, వైస్ ఎంపీపీ సాబ్లె సాగరబాయి రమేష్, బీజేపీ మండల అధ్యక్షుడు బోయిన్‌వాడ్ అమోల్, నాయకులు గోర్బంద్ బాలాజి, బత్తుల అశోక్, గంగాధర్, రాములు, తదితరులు పాల్గొన్నారు.



సిరికొండలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీ సోయం బాపురావు